www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి
- ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్‌పి స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె. ప్రకాష్ బాబు, డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలతో కాలుష్యం

కొండల్లో మైనింగ్ జరిగే ప్రాంతం

- పంటలు,తాగునీరు కలుషితం
- వన్యప్రాణులు, పశువులు, జీవాలూ మృత్యువాత
- పట్టని అధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

సిలికాన్ పౌడర్ కోసం మైనింగ్‌లో చేపట్టే తవ్వకాలు భారీ పేలుడు శబ్దాల ధాటికి వన్య కాలుష్యంతో పంటలు, తాగునీరు కలుషితమై వన్య ప్రాణులు, పశువులు, జీవాలూ మృత్యువాత పడుతున్నాయి. సిలికాన్ పౌడర్ తవ్వకాల కోసం ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు ఒక చోట తవ్వకాలు మరొక చోట జరిపి యాజమాన్యం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోంది. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఫ్యాక్టరీ యాజమాన్యం భయ భ్రాంతులకు గురి చేసి కారు చౌకగా అగ్రిమెంట్ల ద్వారా భూములను కొనుగోలు చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేసింది. మైనింగ్ తవ్వకాల్లో జరిపే భారీ పేలుడు శబ్దం ధాటికి వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మైనింగ్ చుట్టు పక్కల ఉన్న శెట్టివారిపల్లె, కమ్మవారిపల్లె, కొత్త చౌటిపల్లె, మంగపట్నం, కోడిగాండ్ల పల్లె గ్రామాల ప్రాంతాల్లో కాలుష్యం అధికంగా వ్యాప్తి చెందుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో గాలి, నీరు కలుషితమై పశువులు, జీవాలు, జంతువులు, తాము అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం వల్ల పంటలు, బీడీ చెట్లు నాశనం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గొంతు, ఊపిరి తిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్మికులతో గొడ్డు చాకిరి చేయిస్తూ కనీస గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని చేసే కార్మికులు ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిషేధిత ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతూ ఆది మానవుడు గీసిన రేఖా చిత్రాలు ఛిద్రం చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాయల్టీ చెల్లించకుండా సరుకు దొంగ రవాణా చేయడం వల్ల పంచాయతీకు నిధుల కొరత ఏర్పడిందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లారీల, టిప్పర్ల ద్వారా సిలికాన్ పౌడర్ తరలిస్తూ ఆర్జిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. మైనింగ్ తరలించేందుకు వాహనాల రాకపోకలకు రహదారి అనుమతి లేకున్నా ప్రభుత్వ, పట్టా భూముల్లో దౌర్జన్యంగా యథేచ్ఛగా రవాణా చేస్తున్నారని పలువురు అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మైనింగ్ లైసెన్స్ రద్దు చేసి కాలుష్యం బారి నుండి పశువులు, జీవాలు, పంటలను, నీటిని సంరక్షించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కాలుష్యం నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు

కాలుష్యం వల్ల పంటలు, తాగునీరు కలుషితమై ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.వన్య ప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. అనుమతులు ఒక చోట తవ్వకాలు మరొక చోట చేస్తున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద ప్రజల అసైన్ భూములను భయ భ్రాంతులకు గురి చేసి స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్పందించి మైనింగ్‌లో తవ్వకాలు నిలిపి యాజమాన్యంపై చర్యలు తీసుకుని లైసెన్స్ రద్దు చేయాలి.
- రామకృష్ణారెడ్డి, యువ రైతు, కోడిగాండ్లపల్లె.

న్యాక్ ఏ ప్లస్ గ్రేడు లక్ష్యంగా వైవీయూ అడుగులు

- విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

న్యాక్ ఏ ప్లస్ గ్రేడు లక్ష్యంగా విశ్వవిద్యాలయం పయనిస్తోందని, అందులో భాగంగా దూరవిద్యలో పటిష్టం చేస్తున్నామని యోగివేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి ఉద్ఘాటించారు. వైవీయూలోని అన్నమాచార్య సెనెట్ హాల్లో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌పై విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. విశ్వవిద్యాలయం దూరవిద్య ద్వారా 8 కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఎంబిఎ(జనరల్), ఎంబిఎ (హెచ్‌ఆర్‌ఎం) కోర్సులు తీసుకు రానున్నామని ప్రకటించారు. వైవీయూకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడు రాగానే డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. ఉపాధి అవకాశాలు గల కోర్సులు తీసుకురావాలని కోరుతున్నారని, అందుకు తగ్గ కర్కిక్కు లమ్ ఆచార్యులు రూపొందిస్తే తాము తేవడానికి సిద్ధమన్నారు. వైవీయూ దూరవిద్య గురించి అందరూ విస్తృత ప్రచారం కల్పించాలని, ఉన్నత విద్యను అందరూ అభ్యశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కూడా పెరిగేందుకు కృషిచేద్దామని ఆకాంక్షించారు. 3,4 సెమిస్టర్ల మెటీరియల్‌ను సకాలంలో రూపొందించాలని సూచించారు. దూరవిద్యను సులభతరం చేస్తూ సకాలంలో కోర్సు పూర్తిచేసి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ చదువులపట్ల ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరూ ఉన్నత విద్యను అభ్యశించాలనే లక్ష్యంగా వైవీయూ దూరవిద్యను డోర్ స్టెప్‌నకు తీసుకు వెళుతోందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ ప్రస్తుత యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ సూచించినట్లు దూరవిద్య, రెగ్యులర్ విద్య రెండూ సమానమేనన్నారు. అలానే ఒక కోర్సు రెగ్యులర్‌గా మరొక కోర్సు దూరవిద్యలో అభ్యసించే అవకాశం ఉందన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ రెండు కోర్సులు చదువుకుని విస్తృత అవకాశాలు అందుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు దూరవిద్య సిలబస్ ఉపయుక్తమవుతుందన్నారు. దూరవిద్య ఉప సంచాలకులు డాక్టర్ ఎం. శ్రీధర్ బాబు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ హుమానిటీస్ డీన్ ఆచార్య కె.గంగయ్య, ఆచార్యులు బాయినేని శ్రీనివాసులు, ఎన్.ఈశ్వరరెడ్డి, టి. రామప్రసాద్ రెడ్డి, విజయభారతి, అనిత, గంజి పార్వతి, జి. పార్వతి, మెర్సీ విజేత, వినోదిని, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రమీళామార్గరేట్, జయంత్ కశ్యప్, సతీష్ బాబు, లలిత, సుదర్శనరెడ్డి, అంకన్న, హరనాథ్, పలు కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు హాజరై విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు, పుస్తకాల రచయితలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విసి కృష్ణారెడ్డి

అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదు : డిఆర్‌ఒ

డిఆర్‌ఒకు సమస్యను విన్నవిస్తున్న వృద్ధుడు

ప్రజాశక్తి - కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. తొలుత పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పిజిఆర్ఎస్ దరకాస్తు లపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు. కడప మండలం, సరోజ నగర్‌కు చెందిన దేవదానం ఇంటి స్థలం మంజూరు చేయాలని అభ్యర్థించారు. బద్వేలు మండలం చెన్నంపల్లి మిట్ట ప్రగతి నగర్‌కు చెందిన తుడుము వెంకటయ్య తన కుమారునికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమలాపురం మండల కేంద్రానికి చెందిన జూటూరు రాధామని కమలాపురం-కాజీపేట రోడ్డు విస్తరణలో భాగంగా తన ఇంటి భవనాలు పొడయ్యాయని నష్టపరిహారం ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసి వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఐసిలో ఎఫ్‌డిఐకి వ్యతిరేకంగా నేడు నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో వందశాతం ఎఫ్‌డిఐకి, విదేశీ బీమా కంపెనీల ప్రవేశానికి వ్యతిరేకంగా ఈనెల 4న నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎల్ఐసి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవధానం శ్రీనివాస్, ఎ.రఘునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో 'బీమా చట్ట సవరణ బిల్లును తిరస్కరిద్దాం' పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లు 2024ను ప్రవేశ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ సవరణలతో దేశానికి కానీ, పాలసీదారులకు కానీ ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సవరణలు చట్ట రూపొందితే, జాతీయకరణకు ముందు నాటి ప్రయివేటు కంపెనీల మోసాలు మళ్లీ పునరావృతమైతాయని తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లును తీవ్రంగా ప్రతిఘటిద్దామని పిలుపునిచ్చారు. జాతీయకరణ లక్ష్యాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఎల్ఐసి ప్రపంచ స్థాయికి ఎదిగిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ ని వ్యతిరేకిద్దాం, విదేశీ కంపెనీలను తిరస్కరిద్దాం పేరుతో తాము ప్రచార కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగానే మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు అక్బర్ బాషా, వసుప్రద, వారిజాతమ్మ, రత్నకిషోర్, జె.రఘు శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి యూనియన్ నాయకులు

కొప్పల ఆంజనేయులుకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం పరిశోధకులు కొప్పల ఆంజనేయులకు వైవీయు డాక్టర్ ప్రదానం చేసింది. ఆచార్య విజయభారతి పర్యవేక్షణలో వృత్తిపరమైన వైద్యం, నేత కార్మికుల సంస్థల సుస్థిరత తలనాత్మక అధ్యయనం అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు. విసి కృష్ణారెడ్డి రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ రఘు నాథరెడ్డి ఆంజనేయులును అభినందించారు.

తులశమ్మకు ఎమ్మెల్యే నివాళులు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మున్సిపాలిటీ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి తల్లి తులశమ్మ ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా సోమవారం ఉదయం మృతిరాలి ఇంటికి వెళ్లి పూలమాలతో నివాళులర్పించారు. ఆమె వెంట నియోజక వర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు రమణా రెడ్డి, జిల్లా ఎసిసెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు శ్రీరాములు, చెన్నక్రిష్ణా రెడ్డి, మాధవ్ రెడ్డి, జిల్లా సెక్రటరీ హరికృష్ణారెడ్డి, రఘు రాంరెడ్డి, సుబ్బారెడ్డి, మౌలాలి, శేఖర్ ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఎం.ఎ. ఫైజ్‌ఖాన్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్‌గా అమిత్ సింగ్

ప్రజాశక్తి - కడప

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నూతన ప్రిన్సిపల్‌గా అమిత్ సింగ్‌ను నియమించినట్లు గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ఎం.ఎ. ఫైజ్‌ఖాన్ తెలిపారు. నూతన ప్రిన్సిపల్ అమిత్ సింగ్‌ను పాఠశాల బోధన సిబ్బందికి సోమవారం మధ్యాహ్నం అధికారికంగా పరిచయం చేశారు. అనంతరం గవర్నింగ్ కౌన్సిలింగ్ సభ్యులు ఎం. ఆదిత్య రెడ్డి, మసీయుద్దిన్ అహ్మద్, డాక్టర్ స్కంద్ బాలి సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అకడమిక్ ప్రతిభ, క్రీడలు, వినూత్న ఆలోచన, నాయకత్వం, నైతిక విలువలు పెంపొందించడం పై తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. విద్యార్థి- కేంద్రీకృత అభ్యాస వాతావరణం, అధ్యాపకుల సాధికారత, సృజనాత్మకత, శాస్త్రీయ దృష్టి, క్రమశిక్షణను పెంపొందించే సంస్కృతిని ప్రోత్సహించాలనె దృష్టి కోణాన్ని వివరించారు. పాఠశాల సమాజం ఆయన నాయకత్వంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎదురుచూస్తుందన్నారు.

బుడగ జంగాలకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - కడప

బేడ బుడగ జంగం కులస్తులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ సోమవారం మంగళగిరి ఆర్‌ఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితను బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎలవర్తి మధు, కడప జిల్లా నాయకులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేడ బుడగ జంగం కులానికి సంభందించిన జెసి శర్మ కమిషన్ రిపోర్ట్ 2024 సంవత్సరం డిసెంబం 4న రాష్ట్రానికి వచ్చారన్నారు. తిరిగి వచ్చిన రిపోర్టును ఆమోదించి కేంద్రానికి పంపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరమన్నారు. మంత్రి స్పందిస్తూ కచ్చితంగా జెసి శర్మ రిపోర్టును ఆమోదించి కేంద్రానికి పంపే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటానని, ఆన్‌లైన్‌లో మీ కులాన్ని చేర్చే విధంగా ముఖ్యమంత్రితో, సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వర్కింగ్ అధ్యక్షులు ఈబుది శ్రీనివాసులు, బుడగ జంగం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు బయలుదేరుతున్న సిపిఎం నాయకులు

సిపిఎం బహిరంగ సభకు జిల్లా నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నెల్లూరులో సిపిఎం రాష్ట్ర మహాసభల ముగింపు బహిరంగ సభకు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు బయలుదేరి వెళ్లారు. పార్టీ సీనియర్ నాయకులు ఐ.ఎన్. సుబ్బమ్మ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ సభ విజయవంతం నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని చెప్పారు. పార్టీ నిర్ణయించిన లక్ష్యాల మేరకు ముందుకు వెళతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, గోవిందు, రెబ్బ నరసింహులు పాల్గొన్నారు. **గోపవరం :** సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు ఎం. చిన్ని, ఎస్. రాయప్ప, ఎం.వి.కుమార్, జి.అనంతమ్మ, ఎస్. కైరున్‌బీ, నాగబాబు, సి.సుబ్బారాయుడు, ఎస్.కె,. మస్తాన్,కె.శివ,పార్టీ శాఖ కార్యదర్శులు పి.కొండయ్య, మురాప్రసాద్ పార్టీ సభ్యులు కె. బాబయ్య, మస్తాన్ బీ, యు. బాలమ్మ, జి. సుబ్బరాయుడు, రామలక్ష్మమ్మ ఎస్. ఫాతిమా, బాలస్వామి,అధిల్ వెంకటపతి, వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, బయలుదేరారు.

విద్యార్థుల్లో వెలుగును నింపేది 'వసంత పంచమి'

ప్రజాశక్తి - కడప అర్బన్

మాఘ శుద్ధ పంచమి రోజు అక్షరాభ్యాసానికి మంచి రోజని, ఆరోజునే 'వసంత పంచమి' పర్వదినంగా నిర్వహించుకుంటారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతశాఖ ఆధ్వర్యంలో సోమవారం 'వసంత పంచమి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసంత పంచమిని 'శ్రీపంచమి', 'మదన పంచమి' అని కూడా పిలుస్తారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి కళాశాలకు గొప్ప పేరు తీసుకురావాలని పేర్కొన్నారు కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆచార్యులు రమేష్, సంస్కృతం, తెలుగు, చరిత్ర శాఖల విద్యార్థులు పాల్గొన్నారు.

మొదటి ఇన్నింగ్స్‌లో హిమాచల్‌ప్రదేశ్ ఆలౌట్

ప్రజాశక్తి - కడప

కడపలోని వైయస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న కల్నల్ సి కె నాయుడు ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 436 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. 2 వికెట్ల నష్టానికి 159 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో మూడవరోజు బ్యాటింగ్ ప్రారంభించిన హిమాచల్ ప్రదేశ్ తన మొదటి ఇన్నింగ్ లో 124.3 ఓవర్లలో 436 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మిదుల్ పి.సురోచ్ 152 పరుగులు (సెంచరీ) చేశాడు. ఆర్యవట్ శర్మ 75, నారాయన్ 42 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని వాసు 5, శ్రీకర్ 3, కె.ఎస్.రాజు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది.

తలపడుతున్న ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ జట్లు

పేదల ఆకలి తీర్చాలి

ప్రజాశక్తి - కడప

అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ప్రతి ఒక్కరూ పేదవారికి ఆకలిని తీర్చాలని సుభాన్ బాషా పేర్కొన్నారు. రెండేళ్ల నుంచి కడప సిఎస్ఐ స్కూల్ 1978 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం కడప ఎన్టీఆర్ సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ బాషా మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు తమ తమ పనుల నిమిత్తం దూరభారం నుంచి కడప పట్టణంకు వస్తుంటారాని వారికి కడుపునిండా భోజనాలు పెట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. తన స్నేహితులంతా కలిసి ఒక మంచి ఆలోచనతో ముందుకు వచ్చి ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రతిఒక్కరూ పేదప్రజల కోసం ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ కరీం, రఫిక్, విజయ్ కుమార్, సుకుమార్, జయకుమార్, జోహార్ ,ఉస్మాన్ ఖాన్, గౌస్ చాక్లెట్ కార్పొరేటర్ , సుల్తాన్ బాబా, అలీ పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన డిసిసి అధ్యక్షులు

ప్రజాశక్తి - కడప

జిల్లా నూతన ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి నాయకత్వంలో కడప పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కడప ఎస్‌పి కార్యాలయంలో ఆయన్ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ద్వారా ప్రజలకు మరింత మంచి సేవలు అందించాలని కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఎస్‌పిని కలిసిన వారిలో అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు బండి జకరయ్య, ధ్రువ కుమార్ రెడ్డి, ఇర్ఫాన్ బాష, అశోక్ కుమార్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, గౌస్ పీర్, సిరాజుద్దీన్, రఫీఖ్ ఖాన్, హరిప్రసాద్, ఇనామ్, శీలం గంగయ్య ఉన్నారు.

ఎస్‌పికి పూలకుండీ అందజేస్తున్న ఎన్.డి. విజయజ్యోతి

కడపలో క్రైస్తవ చిహ్నాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప

మూడు మతాలను సమానంగా చూడాల్సిన అధికారులు, పాలకులు రెండు మతాలకు ప్రాధాన్యతలు కల్పించి ఒక మతాన్ని విస్మరించటం వారి మనోభావాలను దెబ్బతీయడం అవుతుందని, మూడు మతాలను సమానంగా చూడాలని, క్రైస్తవులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ క్రైస్తవ నమూనాను ఏర్పాటు చేయాలని క్రైస్తవ నమూనా సాధన కమిటీ సభ్యులు మడగలం ప్రసాద్, జ్యోతి జార్జి, సి హెచ్ విజయ్ బాబు, శేఖర్, అల్లూరి జోజప్ప లు కోరారు. సోమవారం నగర కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు, నగర మేయర్ కె.సురేష్ బాబుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నగరంలోని ప్రధాన కూడళ్లను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారని, హిందువులకు, ముస్లిముకు సంబంధించిన నమూనాలను సాదృశ్యంగా నెలకొల్పారని చెప్పారు .ఇందులో మూడవ మతమైన క్రైస్తవులకు వారి నమూనాలని మరిచారని వారు గుర్తు చేశారు. రూ.120 కోట్లతో నగరంలోని 12 సర్కిళ్లను ఎంతో ప్రణాళిక బద్దంగా రూపొందించడం హర్షణీయమన్నారు. ఇందులో భాగంగా క్రైస్తవు నమూనాను విస్మరించారని, ఇది క్రైస్తవులను అవమా నించడం అవుతుందని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు మరొక సారి గుర్తు చేయాలనే ఉద్దేశంతో వినతి పత్రాలు ఇవ్వనున్నామని, తెలిపారు.

కడపలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - కడప

హైదరాబాదులో ఈనెల 7న మందకృష్ణ మాదిగ నిర్వహించే లక్ష డప్పులు- వేల గొంతులు కార్యక్రమానికి మద్దతుగా ఎపి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ ఆధ్వర్యంలో సోమవారం కడప నడిబొడ్డున డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు, గౌరవ అధ్యక్షులు బోనమల ఖాదర్ వల్లి హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణ సాధనే ద్యేయంగా నిర్వహించే లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని వారు చెప్పారు. ప్రకటించారు. కార్యక్రమంలో యావత్ మాదిగ,మాదిగ ఉప కులాల ప్రజలందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కానుకల స్వాహాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు విజయనగరం వీధిలో ఉన్న బేతనీయ ప్రార్థనా మందిరంలో కానుకల స్వాహాపై ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. సోమవారం థామస్ అయ్యర్ వీరయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రార్థన మందిరంలో ఫాస్టర్లుగా పనిచేస్తున్న వారు భక్తుల కానుకలను దుర్వినియోగం చేస్తున్నారని చెప్పారు. విచారణ చేపట్టి నిధులను రికవరీ చేయాలని కోరారు.

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రైతు సంఘం నాయకులు

‘కృష్ణా’ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి నాయకులు కోరారు. ఆ మేరకు సోమవారం రైతు సేవా సమితి ఆధ్వర్యంలో మైదుకూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తహశీల్దార్ రాజ నరేంద్రసింహకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు రైతు భరోసా ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన తెలుగుగంగ, రాజోలి, హంద్రి-నీవా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వెంటనే ప్రాజెక్టులను పూర్తి చేసి ఆయకట్టు రైతులకు సాగు నీరు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చౌక్కం సంజీవ రాయుడు, నియోజకవర్గ అధ్యక్షుడు మాడిశెట్టి సహదేవుడు, వల్లెల, మండల శాఖ నాయకులు కె.రామ్మోహన్, పామలేటి నరసింహ, కోటయ్యగారి మురళి, ఆవుల నాగేష్, బిలిద మిషన్ సుబ్బరాయుడు, షామీర్ బాషా, రామాంజనేయరెడ్డి, నరసింహ, కోటయ్య గారి గుర్రప్ప పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సోమవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సామాజిక సేవ 6వ బృందం, గ్రంథాలయ అధికారి డాక్టర్ డి.కోసప్ప ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. గ్రంథాలయంలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, అధి కారులు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

కొండాపురం : మండల కేంద్రమైన కొండాపురంలోని చిత్రావతి నది ఒడ్డున వెలసిన సరస్వతి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ సరస్వతి అమ్మవారికి అభిషేకాలు పూజలు నిర్వహించామని తెలిపారు. చిన్నపిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. భక్తులకు అమ్మవారి ప్రసాదంగా అన్నదానం చేశామని ఆయన తెలిపారు.

మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆ కమిటీ మాజీ గౌరవ సభ్యుడు మద్దె ప్రకాశం కోరారు. ఆ మేరకు సోమవారం ఆర్‌డిఒ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కమిటీ లేకపోవడం వలన దాడులు ఎక్కువయ్యాయని, వాటిని నివారించడంలో జిల్లా యంత్రాంగం విఫలమైందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లాలో, అన్ని రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు చేయాలన్నారు. జమ్మలమడుగు డివిజన్ స్థాయిలో కూడా వెంటనే నూతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. భూ సమస్యల్లో రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్టర్ అధికారులు అవినీతికి పాల్పడుతూ రికార్డులను తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పోలీస్‌స్టేషన్లలో డికెటి స్థలాలు, అసైన్మెంట్ భూముల గురించి ఫిర్యాదు చేసేందుకు వెళితే వారిని బెదిరిస్తున్నారని ప్రకాశం తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ స్పందిస్తూ ఏ సమస్యలున్నా తన దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

బాలోత్సవంలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

కడప నగరంలో జరిగిన బాలోత్సవంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లా డుతూ.. రెండు రోజుల పాటు జరిగిన బాలో త్సవంలో అత్యధిక భాగాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలు చేశారన్నారు. తమ పాఠశాలకు చెందిన 140 మంది విద్యార్థులు 19 విభాగాల్లో పోటీ చేసి 10 విభాగాల్లో ప్రథమ స్థానం సాధించారన్నారు. శాస్త్రీయ నృత్యం, ఫోక్ డాన్స్, చిత్రలేఖనం, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నిబంధ రచన, సైన్స్ ఎగ్జిబిషన్ వంటి వివిధ విభాగాల్లో తమ విద్యార్థులు అద్భుతంగా ప్రతిభను కనబరిచారన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో వసంత పంచమీ పూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి అక్షరాభ్యాసం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యా ప్రారంభం కోసం ప్రత్యేకమైనదిగా నిలిచిందన్నారు.

క్రైం కార్నర్

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

- ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గతనెల 29న తొండూరు మండలం ఇనగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్టు చేశామని డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 29న ఇనుగనూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబురెడ్డి సొంత పని నిమిత్తం పులివెందులకు వచ్చాడు.. తన పని చేసుకుని తిరిగి గ్రామానికి వెళుతున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మొరంరెడ్డి సమరసింహారెడ్డి, మొరంరెడ్డి హరికిషోర్ రెడ్డి అలియాస్ కిషోర్ కుమార్ రెడ్డి, మొరంరెడ్డి బాల ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి కాపు కాచి దాడి చేశారన్నారు. గాయాలయ్యాయని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి మురళీ నేతృత్వంలో రూరల్ సిఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, తొండూరు ఎస్ఐ చిన్న ఓటన్న, సిబ్బంది సైదాపురం క్రాస్ రోడ్డు, పులివెందుల-ముద్దనూరు మెయిన్ రోడ్డు తొండూరు మండలం వం చనపైన ఉన్న ముగ్గురు నిందితుల గురించి సమాచారం రావడంతో సోమవారం పోలీసులు అరెస్టు చేశారన్నారు. మరో నిందితుడు భాస్కర్‌రెడ్డి పరారీలో ఉన్నాడని, గాలిస్తున్నామన్నారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో 18 గ్రామాలను ఫ్యాక్షన్ గ్రామాలుగా గుర్తించామన్నారు. ఈ గ్రామాలను ఎబిసిడిగా గుర్తించి ఎ లో రెండు గ్రామాలు, బి లో ఆరు గ్రామా లు, సి లో నాలుగు గ్రామాలు, డి లో ఆరు గ్రామాలు చేర్చామన్నారు. ఆయా గ్రామాల్లో కౌన్సెలింగ్ కూడా ఇస్తామన్నారు. ఫ్యాక్షన్ జాడలే లేకుండా చేస్తామని డిఎస్‌పి వివరించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిలువునా ఎండుతున్న వరి పంట

- ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండల పరిధిలో సాగుచేసిన వరి పంట నిలువునా ఎండిపోతోంది. వరి నాట్లు నాటినట్లుగానే ఎండిపోతున్నాయి. రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను రైతులు నూర్పిడి చేసిన తర్వాత రెండవ దఫా మళ్లీ వరి పంటను సాగు చేపట్టారు. కుందూ నది, బోరు బావులు వసతి ఉన్న రైతులు రబీలో వరిసాగు చేపట్టారు. రూ.2వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. గుంత చియ్యపాడు గ్రామ పరిధిలో సాగు చేపట్టిన వరి పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సాగైన వరి పంటకు ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా లేకపోవడంతో రైతులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. చియ్యపాడు మాజీ ఎంపి టిసి దాసరి మహేష్ యాదవ్ వరి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గుంతచియ్యపాడు వద్ద ఎండుతున్న వరి పంట

స్టయిఫండ్ పెంచాలని పశు వైద్య విద్యార్థుల ధర్నా

కళాశాలలో ధర్నా చేస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తమకు స్టయిఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థులు సోమవారం ధర్నా చేశారు. రాష్ట్రంలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాల తిరుపతి, ప్రొద్దుటూరు, గరివిడి (విజయనగరం జిల్లా)విద్యార్థులు దాదాపు 2000 మంది సోమవారం నుంచి ధర్నా ప్రారంభించినట్లు విద్యార్థులు తెలిపారు. తరగతులు బహిష్కరించి ధర్నా చేశారు. ప్రొద్దుటూరు కళాశాలలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థికస్థితులను దృష్టిలో ఉంచుకొని మిగతా వైద్య విద్యార్థులతో సమానంగా పశువైద్య విద్యార్థులకు కూడా తగినంత స్టయిఫండ్ కల్పించాలని కోరారు. చాలీచాలని స్టయిఫండ్‌తో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇది చదువుపై దుష్ప్రభావం పడుతుందన్నారు. పశువైద్య విద్యార్థులు ఎంబిబిఎస్ విద్యార్థుల్లాగానే అయిదేళ్ల చదువుతామన్నారు. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్‌నకు కూడా వెళతామన్నారు. ఎంబిబిఎస్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్టయిఫండ్ పెంచుతూ రూ.25వేలు ఇస్తున్నారని, తమకు మాత్రం 12 ఏళ్లుగా కేవలం రూ.7,000 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుర్వేదిక్, హోమియోపతి, బిడిఎస్ విద్యార్థులకు సముచిత గౌరవవేతనం ఇస్తున్నారని, తమని మాత్రం చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. ఎంబిబిఎస్ పిజి విద్యార్థులకు నెలకు రూ.50వేలు ఇస్తున్నారన్నారు. వెటర్నరీ పిజి విద్యార్థులకు కేవలం రూ.9వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. తమకు కూడా స్టయిఫండ్ పెంచి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖా మంత్రి లోకేష్, పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడును వేడుకుంటున్నామని పేర్కొన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె నోటీస్‌ను కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్‌కు అందజేశారు.

లబ్ధిపొంది విమర్శించడం విడ్డూరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైఎస్ కుటుంబంతో లబ్ధి పొంది వారినే విమర్శించడం విడ్డూ రంగా ఉందని మాజీ మార్కెట్ యార్డ్ మధుసూదన్‌రెడ్డిని ఉద్దేశించి వైసిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో సోమ వారం మున్సిపల్ వైస్ చైర్మన్ హాజీవల్లి, కౌన్సిలర్ కిషోర్, కో-ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి మాట్లాడుతూ తల్లిపాలు త్రాగి రొమ్ము గుద్దే చందంగా తూగుట్ల మధు తీరు ఉందన్నారు. నిజంగా అనాది కాలం నుంచే వైఎస్ కుటుంబ సభ్యులు సర్పంచ్‌లు గా ఉన్నప్పటి నుంచి తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకూడదని తమ సొంత నిధులతో బోర్లు వేయడం, పట్ట ణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మా ణం వరకు వైఎస్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. సొంత ఇంటిలా భావించి పులివెందుల పట్టణ సుందరీకరణ, అభివృద్ధికి రూ.కోట్ల నిధులు వెచ్చించిన ఘనత వైఎస్ కుటుంబందేనని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పులివెందులకు ఇంతవరకు ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయించలేదన్నారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మున్సిపాలిటీ సొం తంగా చేసే అభివృద్ధి పనులను కూటమి నాయకులు చేయించినట్లు ప్రచా రం చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. వైసిపి నాయకులు కోళ్ల భాస్కర్ ఉన్నారు.

పరీక్ష రాయించిన యాజమాన్యం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వం అందించే ఉపకారవేతనంపై విద్యాభ్యాసం చేస్తున్న ఫార్మసీ విద్యార్థిని ఫీజు చెల్లించకపోతే హాల్‌టికెట్ ఇవ్వమని కళాశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసింది. సోమవారం పరీక్ష రాయాల్సి ఉండగా సమాచారం తెలుసుకొని ఆదివారం ‘ప్రజాశక్తి’లో ‘ఫీజు చెల్లించకపోతే పరీక్ష రాయనివ్వం’ అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన శ్రీ లక్ష్మివెంకటేశ్వర ఇన్సిటిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాల యాజమాన్యం ఆదివారం సాయంత్రం విద్యార్థిని యు.ప్రసన్నను కళాశాలకు పిలిపించి హాల్‌టికెట్ ఇచ్చారు. ఆ విద్యార్థి ప్రసన్న సోమవారం ఉత్సాహంగా పరీక్ష రాసి ‘ప్రజాశక్తి’కి ధన్యవాదాలు తెలిపారు.

చెరువులకు నీరిచ్చి రైతులను ఆదుకుంటాం

- మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులకు నీరిచ్చి రైతులను ఆదుకుంటామని, ప్రజలకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్ర నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బక్కన్నగారిపల్లె చెరువు నిండడంతో ఇరిగేషన్ ఇఇ రాజశేఖర్, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్‌తో కలిసి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి జలహారతి ఇచ్చారు. అంతకు ముందు ఆలయంలో పూజలు చేసి ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు నగదుఅందజేశారు. ఈ సందర్భంగా బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ అవకాశం ఉన్న చెరువులన్నింటిని నీటితో నింపే పక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. నీరు లేక పోవడంతో బక్కన్నగారిపల్లె చెరువు ఎండి పోయిందని, భవిష్యత్తులో నీటి సమస్య రాకుండా ఉండేందుకు ఆ చెరువును నీటితో నింపుతున్నట్లు చెప్పారు. నీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన కూడా విజిట్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నీటి సమస్య రాకుండా ఉండేందుకు ప్రస్తుతానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 20 బోర్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు నాయక్, వేమా కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, రామగంగిరెడ్డి పాల్గొన్నారు.

జోరుగా మైనింగ్, మట్కా, గ్యాంబ్లింగ్

- మూడు పార్టీల నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మైనింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ పులివెందులలో హీటెక్కి స్తున్నాయి, మూడు పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇదంతా కమీషన్ కోసమేనని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అన్నీ చూస్తూ అధికారులు మౌనం వహిస్తున్నారనే విమర్శలున్నాయి. వైసిపి, టిడిపి, బిజెపి నాయకులకు నియోజకవర్గంలో లింగాల, వేముల, వేంపల్లి మండలాల్లో ముగ్గురాయి గనులు అధికంగా ఉన్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ నాయకులు ఈ వ్యవహారాలు చూసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఆ నాయకుల్లో సఖ్యతలేక వీటి కోసం కుమ్ములాటలు మొదలయ్యాయి. మరోవైపు వైసిపి నాయకులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోజు ఏదో ఒక పార్టీ నాయకులు మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, గ్యాంబ్లింగ్ వంటివి నిర్వహించేందుకు పోటీపడి మీ ప్రభుత్వంలోనే జరిగాయని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఆధారాలతో సహా నాయకులు మీడియా సమావేశాల్లో చూపిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్టు చూస్తూ ఉన్నారే తప్ప చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు కారణం వారు చేసే దందాల్లో పోలీసులకు వాటా అందడమేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పార్టీల పెద్దలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కానీ జోక్యం చేసుకొని ఈ దందాలు జరక్కుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ఆయా పార్టీల నాయకులు, అధికారులు ప్రయత్నిస్తారో.. లేదో వేచి చూడాల్సిందే.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

వివిధ రకాల పార్టీ పదవులు పొందిన వారు అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరులోని వైసిపి కార్యాలయంలో నూతనంగా పార్టీ పదవుల పొందినవారితో సోమవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ స్థాయిలో పార్టీ పదవులకు కొంతమంది నాయకులను నియమించామన్నారు. ప్రజా సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు మదీనా దస్తగిరి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పార్టీ పదవుల పొందిన వారు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మఠం జడ్పీటీసీ రామగోవింద రెడ్డి, ఎంపిపి వీర నారాయణ రెడ్డి, ఆర్‌వి సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పివి రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రైతు విభాగం మైదుకూరు నియోజకవర్గం అధ్యక్షులు జి.నాగిరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు నేట్లపల్లి శివరామ్ యాదవ్, సుబ్బారెడ్డి, చాపాడు ఎంపిపి లక్షుమయ్య, మేకల రత్నకుమార్ యాదవ్, నరసింహరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, లింగందిన్నె సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - చాపాడు

పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ప్రొద్దుటూరు డిప్యూటీ ఇఒ మీనాక్షి ఆదేశించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలని తెలిపారు. పాఠశాల ఆవరణను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకాన్ని చేపట్టాలని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ వంశీకృష్ణ, పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు అన్యాయం

- ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో చేనేతలకు కేవలం రూ.200 కోట్లు కేటాయించి వారికి తీరని అన్యాయం చేశారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతిఏటా బడ్జెట్‌లో చేనేత రంగా నికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమైన చేనేతకు తగిన గుర్తింపు ఇవ్వకుండా కేంద్రం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. ఎన్నికలకు ముందు సంవత్సరానికి రూ.5000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తావని హామీ ఇచ్చిందన్నారు. 45 లక్షల గ్రామీణ కుటుంబాలు ఆధారపడిన రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణ, గొరిగే కృష్ణ, నరసింహులు, చంటి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలు పంచాయితీ కొత్త పుల్లూరు గ్రామంలో నూతన రామాలయ నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి దంపతులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి శ్రీవివేకానంద విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - సింహాద్రిపురం

అబాకస్ పరీక్షలో రాష్ట్రస్థాయికి తమ విద్యార్థి ఎంపికైనట్లు శ్రీవివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం ఆయన తమ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ విశ్వం ఎడ్యూ టెక్ ఆధ్వర్యంలో ఆదివారం కడపలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీ పరీక్షలో 4వ తరగతి విద్యార్థి జితేంద్ర రాయల్ లెవెల్-3 విభాగంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

ప్రజాశక్తి - ముద్దనూరు

పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, కిశోర బాలికల్లో రక్త హీనత నివారించవచ్చని జిల్లా గణాంకాధికారి రమేష్‌రెడ్డి సూచించారు. బొందలకుంట గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారుల బృందం రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. మాతాశిశు మరణాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ముద్దనూరు వైద్యాధికారి శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. ఆకుకూరలు ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు అరుణకుమారి, నారాయణ, జాకబ్, రాజశేఖర్, పిహెచ్‌సి ఆరోగ్య పర్యవేక్షకులు శోభాకుమారి, రామారావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అనాథ వృద్ధ మహిళకు సోమవారం మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ నిర్వాహకులు అంతిమ సంస్కారం నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక రామేశ్వరానికి చెందిన కుంటుమల్ల పెద్దక్కయ్య అంతిమ సంస్కరణలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో స్థానికులు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుభాన్‌ను ఫోన్ ద్వారా సంప్రదించారు. నిర్వాహకులు తక్షణం స్పందించి స్థానిక హిందూ శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంతిమ క్రియలు నిర్వహించారు. కార్యక్రమానికి చేయూత ఇచ్చిన ఫౌండేషన్ మోరే లక్షణ్ రావు, అహ్మద్‌హుశేన్, నరేంద్ర, సుమన్, మురళికి కృతజ్ఞతలు తెలిపారు. తాము శ్రీ అమ్మ అనాథ శరణాలయం నిర్వహిస్తున్నామని దాతలు సహకరించాలని కోరారు.

క్లబ్‌ను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వర రావు

రిపబ్లిక్ క్లబ్‌లో డిఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ముద్దనూరు రోడ్డులో నిర్వహిస్తున్న రిపబ్లిక్ క్లబ్‌ను డిఎస్‌పి వెంకటేశ్వరరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు క్లబ్‌ను పరిశీలించారు. అనకాపల్లి ఎంపీ రమేష్ ఆది వారం జిల్లా మెజిస్ట్రేట్, ఎస్‌పి పేరుతో ఒక లెటర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ ఫిర్యాదులో జమ్మలమడుగు క్లబ్‌లో అనధికారికంగా పేకాట నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. మొత్తం 12 టేబుళ్ళ ఏర్పాటు చేసి ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు ప్రస్తావించారు. ఎంపీ ఫిర్యాదు నేపథ్యంలో జమ్మలమడుగు డిఎస్‌పి క్లబ్ అం తటా పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. తనిఖీ చేసిన విషయాన్ని ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. తనిఖీలో ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

36వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం అహోబిలపురం మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు ఎంవిఐ బి వెంకట ప్రసాద్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు జైలు శిక్షతో పాటు, అపరాధ రుసుం వేస్తామన్నారు. అనంతరం రోడ్డు భద్రత నియమాల గురించి విద్యార్థులకు వివరించారు. క్విజ్ పోటీలు పెట్టారు. బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

వార్షికోత్సవంలో పలువురు నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె తల్లిశెట్టి సుబ్రమణ్యం, శేషమ్మ జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఎగరవేశారు. పాఠశాలల స్థలదాతల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పాఠశాలల నిర్మాణానికి తల్లిశెట్టి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు స్థలం ఇవ్వడంతో బాలుర, బాలికలకు వేర్వేరుగా ప్రభుత్వం పాఠశాలను నిర్మించిందన్నారు. విద్య, క్రీడాల్లో కూడా రాణించి తల్లిదండ్రులకు, గ్రామానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థులకు టిడిపి యువనేత సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి బహుమతులను పంపిణీ చేశారు. 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రతి ఏడాది పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. స్థల దాత కుటుంబ సభ్యులను పాఠశాల తరుపున సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్, స్థల దాత కుటుంబ సభ్యులు సృజన్ కుమార్, కృష్ణ నందన్, శిల్పిక, పాఠశాల చైర్మన్ బుజ్జి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలకు 7లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

స్వయం ఉపాధి రుణాలు ఈనెల 7లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. బిసి, కాపు (బలిజ ఒంటరి తెల్లగా)రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఇబిసి, బ్రాహ్మణ సామాజిక వర్గాల వారు బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో రుణాలు పొందుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సైబర్ క్రైమ్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ కె.ఉదయ్

సైబర్ క్రైమ్స్, ఆర్థిక అక్షరాస్యత పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని వనిపెంట భారతీయ స్టేట్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.ఉదయ్ పిలు పునిచ్చారు. గంజి కుంట గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ సౌజన్యంతో సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పొదుపు సంఘాల మహిళలు సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్‌లో వ్యక్తిగత సమాచారాలు, ఒటిపిలు ఇతరులకు ఇవ్వకుడదన్నారు. రిటైర్డ్ ఎపిజిబి సీనియర్ మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లావాదేవీలు, పొదుపు నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు, మొబైల్స్ కొచ్చే లింకు పట్ల జాగ్రత్త వహించాలన్నారు. తెలుసుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు, తోటి మిత్రులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో హెర్డ్స్ సంస్థ కో-ఆర్డినేటర్ ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

‘ఫీజుపోరు’ను విజయవంతం చేయండి

పులివెందుల టౌన్ : వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 5న తలపెట్టిన ఫీజుపోరు కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్ని కలెక్టరేట్లలో రాష్ట్ర వ్యాప్తంగా జరగబోయే ఫీజుపోరు పోస్టర్లను సోమవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కిషోర్, వేముల మండలం వైసిపి అధ్యక్షుడు సాంబశివారెడ్డి, తొండూరు మం డల అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, లింగాల మండలాధ్యక్షుడు బాబురెడ్డి, పులివెం దుల మున్సిపాలిటీ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : బుధవారం వైసిపి తలపెట్టిన ఫీజుపోరు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాల యంలో గోడపత్రాన్ని అవి ష్కరించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లా డుతూ పార్టీ అధ్యక్షుడు జగన్ నేతృత్వంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి , మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ఆదేశానుసారం గోడ పత్రాన్ని ఆవిష్కరిం చామన్నారు. కార్యక్ర మంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ప్రొద్దు టూరు పట్టణ అధ్యక్షుడు 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

వైఎస్‌ఆర్ జిల్లా, బద్వేల్ మండలం చెన్నంపల్లి, తొట్టిగారిపల్లి గ్రామం, డోర్ నెం: 9-3-26, నివాసం ఉంటున్న మాబుసాహెబ్ గారి కుమార్తె రాయపాటి హజరత్‌బికి చెందిన పాస్‌పోర్ట్ 23.12.2024వ తేదీన తేదీన తొట్టిగారిపల్లి నుండి బద్వేల్ వరకు జిరాక్స్ కోసం వెళ్తుండగా మార్గమధ్యలో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **Y1282734** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని **73370 56045** మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.